
# గొప్ప ఎడ్వాన్సు ఏర్పాటు ఉద్యమం!




'**నువ్వు** వెయ్యి చెప్పు, లక్ష చెప్పు - ఓ మనిషి గొప్ప వాడవడానికీ, బాగా డబ్బు చేసుకోవడానికీ, అతని ప్రతిభ కన్న అవి సొమ్ము చేసుకొనే లోక జ్ఞానమే ముఖ్యం' అనే మా చిదంబరం మాటకి అభ్యంతరం చెబుతూ

'లోక జ్ఞానం అంటే?' అనడిగాను.

'పెద్ద పెద్ద ఉద్యోగాలకే ఎగనామం పెట్టి యోగ్యులను కున్న కుర్రకారుతో సహా బిజినెస్ వెర్రికి ఎగబడుతున్న ఈ రోజుల్లో సమస్త రంగాల్లోనూ ఓ ఉద్యమంగా విరాజిల్లి పోతున్నది వ్యాపార దృక్పథమే. నీతి నియమాలకు తిలోదకాలిచ్చి వీలైనంత తక్కువ కాలంలో వీలైనంత ఎక్కువ డబ్బు సంపాదించడమే ఈ యుగధర్మం.'

మావా డలా మాట్లాడుతూంటే నాకు గొప్ప ఆశ్చర్యం వేసింది. చిదంబరం అంతో ఇంతో పేరు సంపాదించిన రచయిత. చిన్నప్పట్నుంచీ ఎన్నో వందల కథలు రాసినవాడు. సాహిత్యమనేది మనిషి హృదయ వికాసానికి తోడ్పడే మంచి సాధనమని మనసారా నమ్మినవాడు. ఎక్కువగా

రాసిన వాడు గనుక, తక్కువగానే ఔగాక. అందులో కొన్ని చాలా మంచి కథలు లేకపోలేదు. అవన్నీ ఒక పుస్తక రూపంలో రావాలని వాడి చిరకాల వాంఛ తీరేలా లేదు. సక్సెస్ అందని మనిషి వెక్స్ అయిపోవడంలో ఆశ్చర్యం లేదేమో ......

'ఎందుకూ పనికి రాని ఆ సుందరం గాడు తన కథల పుస్తకం అచ్చు వేయించుకున్నాడు. ఏ విలువలూ లేని ఓ ఎం.ఎల్.ఏ. గారికి అంకితమిచ్చి ఆయనిచ్చిన డబ్బుతో ఎంతో అందంగా తీసుకొచ్చాడా వాల్యూమ్‌ని. చచ్చినా బతికినా వాడి పుస్తకం కాపీ ఏ లైబ్రరీలోనో బతికే ఉంటుంది. పాతికేళ్లయి రాస్తున్నాను. అచ్చయిన కథల ప్రతుల్ని దాచలేక నా ప్రాణాలు పోతున్నాయి. ఎప్పుడో హరీ మంటాను. దాన్తో పాటే ఆ కాగితాలూ గాలికి ఎగిరిపోతాయి. నా లాంటి వాడికి ఆ శిక్ష తగిందే'. అంటూ చిదంబరం కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ చెబుతూనే ఉన్నాడు.

'ఈ లౌకిక ప్రపంచంలో ఇచ్చిపుచ్చుకునే లక్షణ మొకటి ఉందని గ్రహించడానికి నాకు చాలా కాలం పట్టింది. నీ జన్మ మీద గాని, నీ చావు మీద గాని అధికారం లేని నువ్వు, ఎవరి మీదా ఎందునా ఆధారపడకుండా నువ్వుగా బతకాలనుకోడం అజ్ఞానం. అతను ఎమ్మెల్యే అవడానికి ఎంతో ప్రచారం చేసి తోడ్పడ్డాడు కాబట్టే సుందరంకి అతగాడు డబ్బిచ్చాడు. అమాయకులు పసిగట్టకపోవచ్చుగాని ఈ లోకంలోని ప్రతి ఒక్క విజయానికి 'నా వీపు నువ్వు గోకు, నీ వీపు నేను గోకుతాను' అనే లోపాయికారీ ఉద్యమం తోడ్పాటు ఉండి తీరుతుంది.' ఆ లెక్చర్ ఇక భరించలేక అడ్డుపుల్ల వేశాను.

'పోనీ ఇప్పటి కైనా తెలుసుకున్నావ్ కదా! అదే దారి నువ్వూ ఎందుకు తొక్కకూడదు?'

' రైట్ రాయల్ రోడ్డు అలవాటైపోయింది గనక పక్కదారి పట్టడానికి ఓ పట్టాన సిద్ధం కాలేక పోతోంది నా మనసు. ఏమైనా ఎత్తుకి ఎదగాలంటే అంతో ఇంతో కిందకి దిగక తప్పదని గ్రహించాను, దిగాలని కృత నిశ్చయంతో ఉన్నాను కూడా. నీలాంటి దగ్గిర వాడి దగ్గిర నిజం ఒప్పుకోడానికి ఇంకా సిగ్గెందుకు? చూస్తూ ఉండు. ఎవడి నెత్తి మీద్తో చెయ్యిపెట్టి అతి తొందర్లోనే నా పుస్తకం అచ్చు వేసే డబ్బు సంపాదించుకుంటాను.'

చిదంబరం అంతగా ఢంకా బజాయించి చెబుతూంటే తెల్లబోయాను నేను. సొంత డబ్బుతో పుస్తకం అచ్చువేయించుకుంటే అమ్ముకోలేక చావాలి. మామూళ్లే మామూలయిపోయిన సంఘంలో కావలసినంత బ్లాక్ మనీ పేరుకుపోయి ఉంది. అలాంటి దేదైనా పసిగట్టి, దులుపుకోగలిగితే ఎవరి చేతికీ తడి అంటదు. ఎలా వస్తేనేం మా చిదంబరం కథల పుస్తకం అంటూ వస్తే కాంప్లిమెంటరీ కాపీ ఎలాగా నా చేతికి చిక్కుతుంది. ఏ ఏభయ్యోపెట్టి ఎవరు కొనగలడు!

లతా వనితా కవితా ఒకర్ని ఆశ్రయించందే వృద్ధిలోకి రావని మనవాళ్లు ఊరికే అన్నారా? మా చిదంబరం ఏ రాజకీయ నాయకుణ్ణో ఏ సినిమా వాణ్ణో ఆశ్రయిస్తాడని నేను సహజంగా అనుకున్నాను. కాని జరిగింది మరొకటి - ఒక చిత్రమైన అవకాశం అనుకోకుండానే అతని కాళ్ల దగ్గరకొచ్చింది.

అతను కొత్తగా సర్వీసులో చేరిన రోజుల్లో అనకాపల్లిలో 'సరస్వతీ సమాజం' అనే సాహితీ సంఘం స్థాపించాడు. తెలుగక్షరం మీద మమకారం ఉన్న కుర్రకారంతా అందులో చేరి, ఒకటి

రెండేళ్లలోనే అదో మహాసంస్థగా రూపుదిద్దుకుంది. సమయపాలనకీ, క్రమశిక్షణకీ - అతని ఆధ్వర్యంలో అదొక ఉన్నత సాహితీ వేదిక అయికూచుంది 'బాగా చదవందే ఏదీ రాయకూడదు, రాసుకురాందే ఏదీ చదవకూడదు' లాంటి నియమాలు మొదట్లో అతను పెట్టినవే. కథా రచనకి చిదంబరానికి బలమూ, ప్రోద్బలమూ ఆ సంస్థే అని చెప్పొచ్చు ఓ విధంగా. అయితే అనుకోకుండా అతనికి అక్కణ్నుంచి బాగా దూరపు ప్రాంతం, ఏకంగా హైదరాబాదుకే, ట్రాన్స్‌ఫర్ అయిపోయింది. అయినా అయిదేళ్ల పాటు కథలూ, సలహాలూ పంపి దాన్ని ప్రోత్సహించేవాడు. తర్వాత రెండేళ్ల పాటు ఏ ఫంక్షనుకయినా వెళ్లేవాడు. పూర్తిగా మరచిపోలేదుగాని ఇప్పుడా సమాజమే అతనికి తలుచుకుంటే 'అదోలా అనిపించే' స్థితికి దిగజారింది.

దేశంలోని తక్కిన సంస్కృతీ సంస్థల లాగే అదీ ఓ వ్యాపారకేంద్రంగా మారింది. చిదంబరం పెట్టిన నియమ నిబంధనలు గాలికి ఎగిరి పోయాయి. 'ఏ ఫంక్షను జరిపితే ఎంత మిగులు తుందో' అనే దుస్థితికి చేరుకున్నారు అందులోని ప్రతికార్యకార్తా. పేరున్న తెలుగు సాహితీ వేత్తలు చాలామంది వ్యసన పరులు గనక వారి భారీ ఏర్పాట్ల నిమిత్తం ఊరంతా చందాలు దండి అంతో ఇంతో జేబునింపుకునే 'విత్త' శుద్ధి పెరిగింది నిర్వాహకులలో. ఇవన్నీ చెవిన పడి 'సమాజం ఎంత పతన మయింది!' అని చాలా రోజులు బాధపడేవాడు చిదంబరం. ఇప్పుడిప్పుడు తనే పొరపాటు చేశానని తెలుసుకొని లెంపలేసుకునే స్థితికి ఎదిగాడు!

'సరస్వతీ సమాజం' వాళ్లు ఇప్పుడతన్ని ఎప్రోచ్ అయ్యాడు గనుకనే ఆ పూర్వాపరాలు చెప్పుకోవలసి వచ్చింది. నమ్మడం కష్టంగాని చూస్తూండగానే అది స్థాపించి పాతికేళ్లు అయిపోయిందిట. అప్పటి కుర్రాళ్ళంతా ఉద్యోగాలు చేసుకుంటూ ఎక్కడెక్కడో స్థిరపడ్డారు గాని బెల్లం వ్యాపారి కొడుకు చిన్నారావు మాత్రం అక్కడే ఉన్నాడట. తండ్రిపోయాక అతనే వ్యాపారం చూసుకుంటున్నాట్ట. సమాజం స్థాపించిన నాటి నుంచి ఇప్పటి దాకా అందులో ఎంతో చురుకుగా పాల్గొంటున్నాడు. నాలుగేళ్లై ప్రెసిడెంటుగా ఉన్నాట్ట. చిదంబరం ఎడ్రసు ఎలాగో పట్టుకుని అతని వూరు వచ్చేశాడు 'అన్ని ఏర్పాట్లు చాలా గ్రాండ్‌గా చేశాం. ఫౌండర్ ప్రెసిడెంటు మీరు. సిల్వర్ జూబ్లీకి వచ్చి ఆశీర్వదించక తప్పదు. మీరు నాటిన మొక్క ఎంతగా ఎదిగిందో మీరే చూద్దురుగాని. ఊళ్లో వాళ్లంతా ఎంతో ఉత్సాహపడుతున్నారు. డొనేషన్స్ యిచ్చారు, లక్షరూపాయిల పైగా!

అక్షరూపాయిలనే మాట చెవినపడగానే చిదంబరం బుర్ర పాదరసంలా పనిచేసింది. తన కథల పుస్తకం ప్రచురణకి ఇరవై వేలయితే సరిపోతుంది. తనకా మాత్రం పర్సు వాళ్లెందు కివ్వకూడదు! అడిగితే గాని అమ్మైనా పెట్టదు. ఇన్నాళ్లూ చెయి జాచకే తను చెడిపోయింది. ఏమైతే అయిందని నా చేత అడిగించాడు.

'రానూ పోనూ ఖర్చులైనా పుచ్చుకోని నీతి ధనులు చిదంబరంగారు. అడిగితే ఎంతైనా ఎప్పుడో యిచ్చి ఉందుం. పైసా అంతే చీఛీ అనే పరమాత్ములే వారు! ఇది మీకు మీరే ప్రపోజ్ చేసి ఉండాలి' అన్నాడు చిన్నారావు దాంతో 'మంచి పేరు' అనే వంచనకి తలవంచిన మా చిదంబరం ఎలాగో తెప్పరిల్లి.

'పోనీ ఓ పని చేద్దాం. మీ ఇద్దరి మాటా నిలబడేలా నేనో ఉపాయం చెబుతా. నిండు సభలో నాకా ఇరవైవేల పర్సు ప్రదానం మీరు ఏర్పాటు చెయ్యండి 'సన్మానితుడి కృతజ్ఞతలు'

కార్యక్రమంలో అదే పర్సు మీ సంస్థకోసం ఖర్చు పెట్టమని తిరిగి నేనిచ్చేస్తాను' అనే మాటయిచ్చి అతన్ని పంపేశాడు చిదంబరం. 'నువ్వాట్టే కంగారు పడకు. నిన్నూ ఆహ్వానించారుగా! చూద్దువుగాని ఏం జరుగుతుందో .... పర్సు అందుకుంటాను గాని ఛస్తే తిరిగి ఇవ్వను. జుట్టు పీక్కోమను వెధవల్ని. ఇంకా నేర్చుకోకపోవాలా!' అన్నాడు చిదంబరం విషపు నవ్వు నవ్వుతూ.

సరస్వతీ సమాజం సిల్వర్ జూబ్లీ చాలా గ్రాండ్‌గా జరిగింది. చిదంబరాన్ని గొప్పగా సన్మానించారు. పర్సులో ఏముందో అని ప్రేక్షకులకి గాని, మాకు గాని అనుమానం రాకుండా 'రెండొందల వంద రూపాయిల కట్ట' పళ్లెంలో పెట్టి బహూకరించారు. నాతో చెప్పినట్టే చిదంబరం 'తిరిగి ఇవ్వడం డ్యూటీ' పెట్టుకోలేదు! కట్టను ఉంచిన పెట్టెని కాపాడుకోడంలో రాత్రల్లా రైల్లో జాగారం ఉండి ఇల్లుచేరిన మాకు బ్యాంకులో వేసే ముందుగాని అసలు విషయం తెలియలేదు! అందులో అటూ యిటూ ఉన్న రెండూ మాత్రమే వందరూపాయిల నోట్లు. తక్కిన వన్నీ ఆ సైజు తెల్ల కాగితాలే! ఓ తెల్ల కాగితం మీద 'తిరిగి మాకే చేరేవి ఏవైతేనేం! ఆ మాత్రం ముందు జాగ్రత్త లేకపోతే మేం బతగ్గలమా!' అనే చురక ఒకటీ!

*(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 8.5.96)*

✿